# సందడిగా హరితోత్సవం

■ కొనసాగుతున్న దశాబ్ది వేడుకలు ■ పల్లెల్లో ఘనంగా హరిత దినోత్సవం ■ ఉత్సాహంగా సాగిన మొక్కలు నాటే కార్యక్రమం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన హరిత దినోత్సవానికి పల్లెపల్లె కదిలింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఖాళీ జాగాల్లో విరివిగా మొక్కలు నాటారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటి ర్యాలీలు నిర్వహించారు. మొక్కల పెంపకం ద్వారా భవిష్యత్‌తరాలకు ప్రాణవాయువును అందించాలనే ఆవశ్యకతను తెలియజెప్పారు. పచ్చదనంతో కలిగే ప్రయోజనాలను చూపే ప్లకార్డులను ప్రదర్శించారు. ఊరూరా మొక్కలు నాటుతున్న దృశ్యాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 19*



తూప్రాన్: ఇమాంపూర్‌లో నిర్వహించిన హరితోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, గడా అధికారి ముత్యంరెడ్డి



కొల్చారం: మొక్క నాటుతున్న సర్పంచ్ ఉమాదేవి, తదితరులు



చిలిపిచెడ్: ఫైజాబాద్ గ్రామంలో..



నిజాంపేట: మొక్క నాటుతున్న సర్పంచ్ అనూష, ఎంపీటీసీ



రామాయంపేట: కేసీఆర్ కాలనీలో..



వెల్దుర్తి: గోనెమైసమ్మ ఆలయం వద్ద..



మనోహరాబాద్: దండుపల్లిలో మొక్క నాటుతున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్



శివ్వంపేట: గోమారంలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

## 'మంత్రాలు చేస్తున్నారని బంధించారు'

రామాయంపేట రూరల్, జూన్ 19: మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో ఇద్దరిని కమ్యూనిటీ హాల్‌లో బంధించారు. ఈ సంఘటన రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులు బాగా లేవని నారాయణరావుపేటకు చెందిన యాదయ్య, మల్కాపూర్ గ్రామానికి చెందిన మహేందర్‌లను తీసుకువచ్చి ఇంట్లో పూజలు చేయించింది. మంత్రాలు చేస్తున్నారనే నెపంతో ఇద్దరిని గ్రామంలోని ఓ కమ్యూనిటీ హాల్‌లో బంధించారు. విషయం తెలుసుకున్న రామాయంపేట ఎస్‌ఐ రంజిత్ సిబ్బందితో కలిసి వివరాలు తెలుసుకున్నారు. కేవలం అనుమానంతోనే వారిని బంధించినట్లు గ్రామస్తులు తెలుపగా యాదయ్య, మహేందర్‌లను మళ్లీ ఇలాంటి పనులు చేయొద్దని హెచ్చరించారు.

## కంటి శిబిరానికి స్పందన

తూప్రాన్, జూన్ 19: జాతీయ రహదారుల సంస్థ ఆదేశాల మేరకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, పుష్పగిరి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద సోమవారం డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలను సీఐలు సురేశ్‌కుమార్, సందీప్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జీఎంఆర్ పోచంపల్లి హైవేస్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, ఫౌండేషన్ ఇన్‌చార్జి శ్రీనివాస్, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే మున్నూరుకాపుల అభివృద్ధి

రామాయంపేట, జూన్ 19: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలో మున్నూరుకాపుల అభివృద్ధి జరుగుతున్నదని, రాష్ట్రంలో ఉన్న మున్నూరుకాపులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మున్నూరుకాపు సంఘం ఉపాధ్యక్షుడు దేమె యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చింతల రాములు, యాదగిరి అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లాడి వెంకటి, బాదె రామరాజు, చింతల యాదగిరి, శ్రీశైలం, ఎల్లయ్య ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## సర్టిఫికెట్లు అందడం లేదంటూ రాస్తారోకో

పాపన్నపేట, జూన్ 19: సర్వర్ డౌన్ కారణంగా తమకు సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదని ఆరోపిస్తూ వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాపన్నపేట తహసీల్ కార్యాలయం ఎదుట సోమవారం రాస్తారోకో చేపట్టారు. కులవృత్తుల వారికి రూ.లక్ష సాయం పథకానికి దరఖాస్తు చేసుకోవడంలో ఆలస్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాస్ట్, ఇన్‌కం, లోకల్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకొని పది రోజులవుతున్నా అందడం లేదని ఆరోపిస్తూ రాస్తారోకోకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు.

## భూమిలో తేమ ఉంటేనే సాగు చేయాలి

రామాయంపేట, జూన్ 19: పంట పొలాల్లో తేమశాతం ఉంటేనే రైతులు విత్తుకోవాలని రామాయంపేట వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ అన్నారు. సోమవారం రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్, కోనాపూర్ శివారు గ్రామాల్లోని పంట పొలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. వర్షాలు కురిసినప్పుడే పంటలు వేసుకోవాలని తెలిపారు. ఈ వానకాలం సీజన్‌లో ఇప్పటివరకు వర్షాలు పడటం లేదన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటించని రైతులు నష్టపోక తప్పదవన్నారు. అవగాహన కార్యక్రమంలో ఏఈవోలు సాయికృష్ణ, స్రవంతి, రాజు ఉన్నారు.

## విద్యార్థినికి బ్లాక్ బెల్ట్

రామాయంపేట రూరల్, జూన్ 19: రామాయంపేట పట్టణానికి చెందిన కుంగ్ ఫూ మాస్టర్ వరగంటి పూర్ణచందర్ కూతురు నేహశ్రీ బ్లాక్ బెల్టు అందుకుంది. ఇటీవల సంగారెడ్డిలోని చౌహాన్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుంగ్ ఫూ బ్లాక్ బెల్ట్ గ్రేండింగ్ పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చింది. ఈ బ్లాక్ బెల్ట్‌ను ప్రముఖ సినీ హీరో సుమన్ చేతుల మీదుగా అందుకున్నట్లు పూర్ణచందర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బ్లాక్ బెల్ట్ సాధించిన నేహశ్రీని పట్టణ ప్రజలు అభినందించారు.

## నేడు 'మన బడి' ప్రారంభం

వెల్దుర్తి, జూన్ 19: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించే విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మన ఊరు -మన బడి పాఠశాలలను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నామని ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి మండల పరిధిలోని కుకునూర్ ప్రాథమిక పాఠశాల, మాసాయిపేట మండల పరిధిలోని కొప్పులపల్లిలో ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

## మున్నూరు కాపులకు బీసీ రుణాలివ్వాలి

నిజాంపేట, జూన్ 19: ప్రభుత్వం మున్నూరుకాపులకు కూడా బీసీ రుణాలను అందించాలని కోరుతూ మండల మున్నూరు కాపు సభ్యులు గురువారం నిజాంపేట తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్నూరు కాపులలో బీద, మధ్యతరగతికి చెందిన వారు ఎంతోమంది ఉన్నారని, రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధిరాములు, మున్నూరు కాపు మండల సభ్యులు, తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

రామాయంపేట, జూన్ 19: ఉత్తమ సేవలకు గానూ రామాయంపేట లయన్స్ క్లబ్‌కు హైదరాబాద్‌లోని మియాపూర్ విశ్వనాథ్ గార్డెన్‌లో అవార్డులను గవర్నర్ గంధని శ్రీనువాస్ అందజేశారు. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన డిస్ట్రిక్ట్ చైర్మన్‌లు దేమె యాదగిరి, ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పొడెండ్ల లక్ష్మణ్‌యాదవ్, వంగరి కైలాస్ అవార్డులను అందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, వ్యాసరచన పోటీలతోపాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ విశిష్ట సేవలందిస్తున్న అవార్డులు దక్కాయన్నారు.

## మట్టి తవ్వకాలను పరిశీలించిన ఏఈ

వెల్దుర్తి, జూన్ 19: నిబంధనలకు విరుద్ధంగా చెరువులు, కుంటల నుంచి మట్టిని తవ్వవద్దని ఇరిగేషన్ ఏఈ కవిత అన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని ఆరెగూడెం శివారులోని రామిరెడ్డి చెరువులో మట్టి తవ్వకాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులు, కుంటల్లో సంబంధిత శాఖల అనుమతులతోనే మట్టి తవ్వకాలు చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బాల్య వివాహాలపై అవగాహన

చిలిపిచెడ్, జూన్ 19: బాల్య వివాహాలు నేరమని, 18 ఏండ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ సభ్యురాలు సాక్రుబాయి, మమత సూచించారు. సోమవారం మండలంలోని చిట్కుల్ కేజీబీవీ పాఠశాలలో కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ సెంటర్ ఫర్ యాక్షన్ రీసెర్స్ పీపుల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి తిరుపతి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

## నేడు శివ్వంపేటకు కలెక్టర్ రాక

శివ్వంపేట, జూన్ 19: శివ్వంపేట మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి వస్తారని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.